క్లుప్తంగా

వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ



గర్భిణులు, బాలింతలకు పోషణ కిట్లును అందజేస్తున్న వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు

డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుం పంచాయతీ సర్రాయి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ పోషణ కిట్లును గర్భిణులు, బాలింతలకు సోమవారం వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రక్తహీనత సమస్య లేకుండా అధిక పోషక విలువలతో కూడిన కిట్‌లను ప్రభుత్వం అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వార్డు సభ్యులు కృష్ణ, లచ్చన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు రేఖమ్మ, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో పశువైద్య శిబిరం



పశువులకు చికిత్స చేస్తున్న వైద్యులు

ఎటపాక: మండలంలోని నందిగామ గ్రామ పంచాయతీలో సోమవారం ఐటీసీ బంగారు భవిష్యత్ ప్రోగ్రాంలో భాగంగా గొరిదేవిపేట పశువైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చూడు నిలవని పశువులకు ప్రత్యేక చికిత్సలు అందించారు. అదే విధంగా దూడలకు నట్టల మందులు వేశారు. అనంతరం పశువుల్లో వచ్చే వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. డాక్టర్ మహేశ్వరరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయికు దూరంగా ఉండాలి



యువతకు క్రీడా సామగ్రి, వృద్ధులకు మందులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ

సీలేరు: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన రాంపురం, హరిపురం, జి.నేరేడుపల్లి, రాళ్లగడ్డ, పెద్దగొంటి, పెట్రాయ్, నిమ్మచెట్టు, చిన గంగవరం, గ్రామాల్లో ఎస్ఐ రామకృష్ణ సోమవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి పంటకు గిరిజనులు దూరంగా ఉండాలని సూచించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గంజాయికి దూరంగా ఉండాలని, ఉద్యోగావకాశాల వైపు వెళ్లాలని సూచించారు. యువతకు క్రీడా సామగ్రి, వృద్ధులకు మందులు అందించారు.

విద్యార్థుల చదువుపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహన్, పక్కన ఉపాధ్యాయులు

కొయ్యూరు: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్ మాట్లాడుతూ విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్థానిక గురుకుల పాఠశాల సెంట్రల్ బోర్డు సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నోడల్ పాఠశాలగా ఎంపికైనట్టు తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు తెలిపారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ అర్జున్, వైస్ చైర్మన్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నేడు

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి శ్రీ చింతామణి గణపతి దత్తక్షేత్రంలో మంగళవారం ఉదయం 9 గంటలకు సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు ఆంజనేయరాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. అదే రోజు ఉదయం 7 గంటలకు కార్యసిద్ధి ఆంజనేయస్వామికి పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- తరలివచ్చిన గిరిజనులు



భీరం గ్రామంలో ఏర్పాటుచేసిన పోషకాహార పదార్థాల స్టాల్

జి.మాడుగుల: మండలంలోని భీరం సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మాదుల రత్నకుమారి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రజల చెంతకు వైద్యం అందించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించి, ఉచితంగా వైద్య పరీక్షలు అందజేస్తోందన్నారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 312 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు తెలిపారు. భీరం గ్రామంలో ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్ అందిరినీ ఆకట్టుకుంది.ఎంపీహెచ్‌ఈవో నడిగట్ల ప్రకాష్, మాజీ వైస్ ఎంపీపీ టి బొంజునాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని దేవరాపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరంలో 430 మందికి వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ బుజ్జిబాబు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సీడీపీవో లక్ష్మీదేవి,కార్యదర్శి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు

చింతపల్లిరూరల్: మండలంలోని యర్రబొమ్మలు గ్రామంలో నిర్వహించిన జేఏఎస్ శిబిరంలో 509 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సిబ్బంది పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఆశాజ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, సర్పంచ్ ఎల్.పండయ్య, ఎంపీటీసీ సత్తిబాబు, కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



దేవరాపల్లిలోని వైద్య శిబిరంలో గ్రామస్తులు

అడ్డతీగల: మండలంలోని గొండోలు గ్రామంలో నిర్వహించిన జేఏఎస్ శిబిరంలో 356 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు సాయిరాం, షమా, నాగ ప్రత్యూష, సర్పంచ్‌లు నాగులపల్లి రాఘవ, బోనెం రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని గన్నవరంలో నిర్వహించిన జేఏఎస్ శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైఎస్సార్‌సీపీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి లక్ష్మణరావు, సర్పంచ్‌లు కృష్ణ, భద్రమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కంటె రాజు, ఉప సర్పంచ్ స్వర్ణ, వైద్యులు గౌతమి, దేవినాగు, లక్ష్మీప్రశాంతి, విష్ణుప్రియ, పంచాయతీ కార్యదర్శి శిరీష తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని యర్రంరెడ్డిపాలెంలో నిర్వహించిన జేఏఎస్ శిబిరంలో 387 మందికి వైద్య పరీక్షలు చేశారు. డీటీ కె.సుధాకరరావు, ఈవోపీఆర్డీ డి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: వంచంగి గ్రామంలో నిర్వహించిన జేఏఎస్ శిబిరంలో 261 మందికి పరీక్షలు చేశారు. తహసీల్దార్ / నోడల్ ఆఫీసర్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి, సర్పంచ్ కూండ్రు కాంతం, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి , గైనకాలజిస్ట్ మౌనిక, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ధర్మ కిషోర్, జడ్డంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సేవ సుజి, లాగరాయి పీహెచ్‌సీ డాక్టర్ రవీంద్ర, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ నానాజీ, ఎంపీటీసీ సభ్యురాలు కోసూరి చిన్నాలమ్మ, సర్పంచ్ తౌంటా ఆదిరాజు, నాయకులు వెంకటేష్‌రాజు, కన్వీనర్ అర్జున్, సెక్రటరీ మూర్తి, ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మర్రిపాలెంలో నిర్వహించిన జేఏఎస్ శిబిరంలో 406 మందికి పరీక్షలు చేశారు. వైద్యాధికారి భావన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, వైద్యాధికారులు సాయిరతన్, దుర్గాప్రసాద్, మర్రిపాలెం సర్పంచ్ వెంకటేశ్వర్లు దొర, కార్యదర్శి గణేష్, వీఆర్వో వెంకటేశ్వర్లు దొర తదితరులు పాల్గొన్నారు.



యర్రబోమ్మలులో రోగులను పరిక్షిస్తున్న వైద్యులు



గొండోలులో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



గన్నవరంలోని వైద్య శిబిరంలో రోగులు



యర్రంరెడ్డిపాలెంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



మర్రిపాలెం వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బంది



వంచంగిలో ఏర్పాటుచేసిన పోషకాహార పదార్థాల స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నేతలు



వంచంగిలో శిబిరానికి వచ్చిన రోగులు

రీ సర్వేతో రైతులకు మేలు

గంగవరం : మండలంలోని జగ్గంపాలెంలో గ్రామ సర్పంచ్ తుర్రం లీలావతి ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. పోతన్నదొరపాలెం గ్రామానికి చెందిన భూ సమస్యలను ప్రస్తావించారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ భూములు రీ సర్వేతో రైతులకు మేటు జరుగుతుందన్నారు. రీ సర్వేకు సహకరించాలన్నారు. వారసులు వారి భూముల విభజనపై దరఖాస్తులు చేసుకొని భూములు విభజించుకొని హక్కులను పొందాలన్నారు. భూసమస్యలుంటే గ్రామసభల ద్వారా పరిష్కరిస్తామన్నారు. పోతన్నదొరపాలెం గ్రామానికి చెందిన పలువురి గిరిజన రైతులకు చెందిన భూ సమస్యపై గ్రామసభలో విచారణ నిర్వహించారు. గ్రామ పరిపాలనాధికారి సత్యనారాయణ, గ్రామ సర్వేయర్ నాగార్జున పాల్గొన్నారు.



జగ్గంపాలెంలోని గ్రామసభలో తహసీల్దార్ శ్రీమన్నారాయణ, సర్పంచ్ లీలావతి

ప్రత్యామ్నాయ మార్గాలతోనే అభివృద్ధి సాధ్యం

రాజవొమ్మంగి: ప్రత్యామ్నాయ విధానాలతోనే రంపచోడవరం నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం అని సీపీఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. ఆయన సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చదువుకొన్న గిరిజన యువతకు సరైన విధంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ పార్టీల నాయకులు తమ స్వార్థపూర్వక ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి సీపీఎం మాత్రమే రాజీలేని పోరాటం సాగిస్తోందన్నారు. స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న రంపచోడవరంలో జరిగే బహిరంగ సభకు వేలాదిగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. లోదొడ్డి సర్పంచ్ రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి నాయకులు రామరాజు, నూకరాజు, సింహాచలం, బాబూరావు, ప్రసాద్, నాగమణి, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కిరణ్

ఎమ్మెల్యే ధనలక్ష్మి ఔదార్యం

రంపచోడవరం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చొరవతో అనారోగ్యంతో బాధ పడుతున్న గిరిజన బాలుడుకి శస్త్ర జరిగింది. మారేడుమిల్లి మండలం డీవీ కోటలో ఈ నెల 3న నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో టి.మనోజ్‌రెడ్డి అనే ఎనిమిది సంవత్సరాల బాలుడు తొడకాలిలో ఆపరేషన్ రాడ్ బయటకు వచ్చి బాధపడడం ఎమ్మెల్యే గమనించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆ బాలుడిని ప్రత్యేక వాహనంలో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మితో మాట్లాడారు. బాలుడు మనోజ్‌రెడ్డికి రెండేళ్ల క్రితం ప్రమాదంలో కాలికి గాయం కావడంతో తొడకాలిలో రాడ్ వేశారు. మూడు నెలలు క్రితం రాడ్ ఐదు అంగుళాలు బయటవచ్చింది. బాలుడు పరిస్థితి చూసి చలించిపోయిన ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో ఆసుపత్రి వైద్యులకు మెరుగైన వైద్యం చేయాలని సూచించారు. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మి ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ సుధాకర్, మత్తు డాక్టర్ పద్మావతిలు సోమవారం ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది. రంపచోడవరం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దూడ స్మిత్ ఆసుపత్రిలో బాలుడును పర్యవేక్షణ వేశారు.



రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఆపరేషన్ అనంతరం బాలుడు మనోజ్‌రెడ్డి

గొర్రెలు, మేకల సంతకు దసరా కళ

- స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు

కెఎంకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంత సోమవారం కళకళలాడింది. చాలా రోజుల తర్వాత గొర్రెలు, మేకల్ని అధిక సంఖ్యలో విక్రయానికి తీసుకొచ్చారు. విజయదశమి సమీపిస్తుండటంతో ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు తూర్పు గోదావరి జిల్లా నుంచి పెంపకందారులు, వ్యాపారులు అమ్మకానికి తీసుకువచ్చారు. ఇప్పటి వరకు 500 వరకు ప్రతి వారం అమ్మకానికి వచ్చేవి. ఈ వారం రెట్టింపు అయ్యాయి. దీంతో సంతలో సందడి నెలకొంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వీటిని కొనుక్కున్నారు. పరిమాణం ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.25 వేలు వరకు ధర పలికింది. విశాఖ, గాజువాక, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి హోటళ్ల నిర్వాహకులు, కొనుగోలుదారులు, వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి వ్యాన్లలో తరలించుకుపోయారు.



వ్యాన్‌లో గొర్రెలు, మేకల తరలింపు

రేపు మండల సమావేశం

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.శ్రీనివాసులు తెలిపారు. ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన ఆ రోజు ఉదయం గం 10.30 లకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే పర్యటన రేపు

వై.రామవరం: మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబులు బుధవారం పర్యటించనున్నట్టు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మీలు తెలిపారు. మండలంలోని చవిటిదిబ్బలు సచివాలయంలో ఆరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, గృహసారథులు బారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు బెన్నవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

చింతపల్లి: మండలంలోని బెన్నవరంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి తెలిపారు. కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్ల భాగ్యలక్ష్మి హాజరవుతారని ఆయన తెలిపారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు పెదకోడాపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

పెదబయలు: మండలంలోని పెదకోడాపల్లి పంచాయతీలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి సిందూరంపడాల్ తెలిపారు. కార్యక్రమానికి అరకు ఎమ్మెల్యే హాజరవుతాయన్నారు. శిబిరానికి వైద్య నిపుణులు వస్తారని తెలిపారు. అనంతరం పెదకోడాపల్లి ఆర్‌బీకేను ప్రారంభిస్తారని స్థానిక మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట

పరవాద: పెదముషిడివాడలో దుర్గాదేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని సర్పంచ్ పల్లా నాగమణి చెప్పారు. ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం పందిరిరాట వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ కలవలపల్లి సత్యనారాయణ, బొండా అరుణ, బలిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.



పందిరి రాట వేస్తున్న సర్పంచ్ నాగమణి

దుర్గమ్మ రాట మహోత్సవం

అనకాపల్లిటౌన్: స్థానిక నర్సింగరావుపేట మెహర్‌బాబావీధిలో శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని సోమవారం అమ్మవారి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 150 మంది ముత్తయిదువులు హాజరై, రాటకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ముత్తయిదువులకు రవిక, గాజులు, పసుపు, కుంకుమలు అందించారు.

బంతి సాగు.. లాభాలు బాగు



జంగిడివలసలో మేరిగోల్డ్ బంతితోట

- ఏడాదికి రూ.80వేల ఆదాయం
- రెండు ఎకరాలు..రెండు నెలల పంట
- మేరిగోల్డ్ పూల సాగుపై ఆసక్తి

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని బంతి సాగు విస్తారంగా ఉంది. ప్రస్తుత సీజన్‌లో మన్యంలోని వాతావరణం బంతి సాగుకు అనుకూలంగా ఉంటుంది. దీంతోపాటు మన్యంలో బంతికి మైదాన ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. దీంతో చాలా ప్రాంతాల్లో బంతి సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. ఆశించిన ధరలు ఉండడంతో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. అరకు నియోజకవర్గం డుంబ్రిగుడ మండలం కురిడి పంచాయతీ జంగిడివలస గ్రామంలో గిరిజన రైతు పేటేలి భీమన్న మేరిగోల్డ్ బంతిపూల తోటల సాగుతో గత మూడేళ్ల నుంచి మంచి ఆదాయం పొందుతున్నాడు. ఈ ఏడాదితో నాల్గోవ ఏడాది కూడా పూలసాగు చేస్తున్నాడు. రెండు ఎకరాలలో సాగు చేస్తున్న మేరిగోల్డ్ రకంలోని ఆరెంజ్, పసుపు రంగుల బంతితోటలు ఈఏడాది కూడా విరగ్గాసాయి.

విరగ్గాసిన బంతి

డుంబ్రిగుడ–అరకులోయ రహదారిలో కురిడి సమీపంలోని రైల్వే గేటు నుంచి ఈ బంతిపూల తోటలు నందనవనంగా దర్శనమిస్తున్నాయి. ఎస్.కోట కు చెందిన వ్యాపారులు నేరుగా తోటకు వచి 6కిలోల బంతిపూల క్రేట్‌ను రూ.300 నుంచి రూ.350ధరతో కొనుగోలు చేస్తున్నారు. మార్కెటింగ్‌కు రైతు కష్టపడాల్సిన పరిస్థితి లేదు. గత ఏడాది కూడా బంతిపూల సాగు, అమ్మకాల ద్వారా రూ.70వేల ఆదాయం వచ్చినట్టు, పెట్టుబడి కూడా పెద్దగా లేదని గిరిజన రైతు భీమన్న చెబుతున్నాడు. రెండు ఎకరాలలో వేసిన బంతిపూల తోటలు రెండు నెలలు పాటు విరగ్గాస్తున్నాయి. ప్రతి ఏడాది జూలై నెలలో విత్తనాలు జల్లుతుండడంతో సెప్టెంబర్ నెలాఖరు నాటికే పూలు విరగ్గాస్తున్నాయి.ఈ ఏడాది కూడా బంతి తోటలకు వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పూత విరగ్గాస్తుంది. దీంతో గత రెండు వారాల నుంచి భీమన్న బంతిపూలను సేకరించి ఎస్.కోట వ్యాపారికి అమ్మకాలు జరుపుతున్నారు. నవంబర్ నెల వరకు బంతిపూల కాపు ఉంటుందని, రెండు నెలల పంట అమ్మకాలు ద్వారా ప్రతి ఏడాది మంచి ఆదాయం వస్తుందని భీమన్న సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. మేరిగోల్డ్ బంతితోటల సాగుతో ఏటా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందుతున్నట్టు చెబుతున్నారు.

ఆదాయం బాగుంది



బంతిపూల సాగు ద్వారా ప్రతి ఏడాది ఆదాయం బాగుంది.ఈ ఏడాది కూడా కాపు బాగుండడంతో వారానికి రెండు సార్లు సేకరించి అమ్మకాలు జరుపుతున్నాను.వ్యాపారులే నేరుగా గ్రామానికి వస్తుండడంతో మార్కెటింగ్‌కు ఇబ్బందులు లేవు.గత ఏడాది రూ.70వేల ఆదాయం వచ్చింది.ఈఏడాది మరింత పెరిగే అవకాశం ఉంది.పెట్టుబడి కూడా తక్కువే. ఇంటిల్లాపాది పూల సేకరిస్తున్నాం.

పేటేలి భీమన్న , రైతు, జంగిడివలస, డుంబ్రిగుడ

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



గొడ్డుబూసులులో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

జి.మాడుగుల: మండలంలో సింగర్భ పంచాయతీ గొడ్డుబూసులు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో గ్రామంలో స్మశాన వాటికకు మట్టిరోడ్డు నిర్మాణ పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు గంగరాజు, చిట్టిబాబు సోమవారం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో రూ.6లక్షలు నిధులు వెచ్చిస్తున్నట్టు చెప్పారు. సచివాలయ కన్వీనర్ వి సూర్యప్రకాష్ నాయుడు,వైస్ సర్పంచ్ విజయ్, వార్డు నెంబర్ కె చిన్నబ్బాయి,వైఎస్సార్‌సీపీ నాయకుడు దేముళ్లనాయుడు, ఉపాధిహామీ పథకం సిబ్బంది హేమ, చిట్టినాయుడు, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



పెదబరడలో బోరు పనులు ప్రారంభిస్తున్న నేతలు

ఎంపీ నిధులతో...

చింతపల్లి: మండలంలోని పెదబరడలో అరుకు ఎంపీ గొడ్డేటి మాధవి నిధులతో మంచి నీటి బోరు పనులు సోమవారం ప్రారంభించినట్లు మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ తెలిపారు. గ్రామంలో మంచి నీటి ఎద్దడి నివారించాలని ఎంపీ మాధవి దృష్టికి తీసుకు వెళ్లగా బోరు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని సత్యనారాయణ తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో జల్లి రవి, బొబ్బిలి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలకు స్థల పరిశీలన

హుకుంపేట: మండల కేంద్రంలో జిల్లా రవాణా శాఖ కార్యాలయం నిర్మాణానికి జేసీ. శివ శ్రీనివాస్ సోమవారం స్థలాన్ని పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ ప్రాంగణంలో రవాణా శాఖ, వెలుగు కార్యాలయాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు రవాణాశాఖ కోసం 92 సెంట్లు, వెలుగు కార్యలయం ఏర్పాటుకు 20 సెంట్లు స్థలం కేటాయించినట్టు తెలిపారు. కొద్ది రోజుల్లోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్టు చెప్పారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు కోరారు. జిల్లా రవాణాశాఖాధికారి లీలాప్రసాద్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, డీటీ రంగారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేటలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ శివశ్రీనివాస్

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

రంపచోడవరం: కార్బన్ క్రెడిట్స్ ద్వారా గిరిజనులకు ఆదాయం వస్తుందని వారాహ సీనియర్ టీమ్ లీడర్ కళితిల్ శివకుమార్ అన్నారు. రంప గ్రామంలో వారాహ క్లైమైట్ అగ్ ఆధ్వర్యంలో, గిరిజన మిత్రా ఫౌండేషన్ ద్వారా రైతలుకు వాతావణ మార్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా టీమ్ లీడర్ శివకుమార్ మాట్లాడుతూ ఆగ్రో ఫారెస్ట్రీ ద్వారా గిరిజన రైతులకు జీవనోపాధి కల్పించడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో పెట్టుబడి లేకుండా రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. వారాహ సంస్థ ద్వారా రైతులకు డబ్బులతో పాటు , వివిధ రకాల మొక్కలు అందజేయడం జరుగుతుందన్నారు. గిరిజన మిత్రా పౌండేషన్ కో–ఆర్డినేటర్ డాక్టర్. ఉదయ శ్రీనివాస్,అరవింద్‌కుమార్, నాగేశ్వరరావు, లింగబాబు, శివబుల్లిదొర తదితరలు పాల్గొన్నారు.



రంపలో రైతులతో శివకుమార్